క్లుప్తంగా

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



గండ్రేడులో ప్రజలకు సరఫరా అవుతున్న నీటి స్వచ్ఛతను పరిశీలిస్తున్న అధికారులు

పెదపూడి: తాగునీటిని ప్రతి రోజూ క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్ సిబ్బందికి ఆదేశించారు. గండ్రేడు, చింతపల్లి గ్రామాల్లో వారు సోమవారం పర్యటించి, వాటర్ ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేశారా, లేదా, నీటి పరీక్ష, ట్యాంకు ఎలాంటి పరిస్థితుల్లో ఉంది తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వాతావరణంలో మార్పుల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. వారి వెంట ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు వాసంశెట్టి శిరిష, ఎస్వీ స్వామి నాయకుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ రాజీనామా

సీతానగరం: మండలంలోని విష్ణాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ పదవికి సలాది శ్రీనివాసరావు సోమవారం రాజీనామా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవదాయ, ధర్మాదాయ శాఖ తనను సీతానగరం విష్ణాలయం కమిటీ చైర్మన్‌గా నియమించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి కారణంగా తన పదవికి రాజీనామా చేశానని చెప్పారు. సంబంధిత అధికారులకు రాజీనామా పత్రాన్ని అందించానన్నారు.

గాయకుడు మల్లిడి కన్నుమూత



విజయభాస్కర్‌రెడ్డి(ఫైల్)

పెదపూడి: అనపర్తిలో ఘంటసాల ఆరాధన కమిటీ సభ్యుడు, గాయకుడు మల్లిడి విజయభాస్కర్ రెడ్డి(64) ఆదివారం ఆకస్మికంగా కన్ను మూశారు. విజయభాస్కర్‌రెడ్డి ఘంటశాల పాటలపై మంచి అవగాహనతో, ఏళ్ల తరబడి అనేక సంగీత కార్యక్రమాల్లో విశేష సేవలందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కమిటీ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. వీరిలో కమిటీ అధ్యక్షుడు దుర్వ శ్రీరామమూర్తి, సభ్యులు సత్తి బుల్లిరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, చాగంటి సుబ్రహ్మణ్యం, కర్రి హరనాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రసాద్, సాల్మన్‌రాజు తదితరులున్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



డాక్టర్ వాడ్రేవు కె.రాజుకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళా సాధికారత కీలకమైందని అమెరికాలో స్థిరపడిన భారతీయుడు, ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ వాడ్రేవు కె.రాజు అన్నారు. గైట్ గ్లోబల్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన సమావేశంలో డాక్టర్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. తల్లిదండ్రులతో గౌరవ, మర్యాదలతో నడుచుకోవాలని యువతకు హితవు పలికారు. దైనందిన జీవనంలో శరీర వ్యాయామానికి కూడా తగిన ప్రాధాన్యమిస్తూ, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైతన్య విద్యా సంస్థల చైర్మన్, యూనివర్సిటీ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ పిల్లలలో అంధత్వాన్ని నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైన సేవలందిస్తున్న డాక్టర్ రాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీసీ చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు.

హక్కుల వినియోగంతో పురోగతి సాధించాలి

కంబాలచెరువు: రాజ్యాంగబద్ధంగా, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అందిన హక్కులను వినియోగించుకుని ట్రాన్స్‌జెండర్లు సామాజికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, వారి సమస్యలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లపై ఎవ్వరూ వివక్ష చూపరాదన్నారు. స్త్రీ, పురుషులతో సమానంగా వారికి అన్ని హక్కులున్నాయని తెలిపారు. స్వయం ఉపాధి కోసం అందుబాటులో ఉన్న సబ్సిడీలను వివరించారు.

ఖరీఫ్ సాగుకు రెడీ



చినకొండేపూడిలో మోటార్లు ఉన్న చోట వేసిన వరి నారుమడి

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ సాగునీటి విడుదల కోసం ఎదురుచూపులు

సీతానగరం: నైరుతి రుతుపవనాలు పలకరించాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. వరి నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎప్పుడు జూన్ నెలాఖరుకు కనిపించే రుతుపవనాలు ఈ ఏడాది జూన్ తొలి వారంలోనే వచ్చేశాయి. అడపాదడపా వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. రైతులలో ఆనందం వెల్లివిరిసింది. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ సాగునీటి విడుదల ఎప్పుడా అని రైతులు ఎదురు చూస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఈ సాగునీరు తోడైతే ఆకుమడులకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది జూన్ నెలలో సాగునీటిని విడుదల చేయడంతో సాగు పనులు త్వరగా పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల పూర్తవుతున్నా సాగునీటి విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

16 వేల ఎకరాల్లో..

మండలంలో సుమారు 16 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు చేపడుతున్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి 14 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే బోర్లు ఉన్న ప్రాంతాల్లో వరి నారుమళ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. సాగుకు ముందు విత్తన శుద్ధి తప్పనిసరి చేయాలని, విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించాలని వ్యవసాయ అధికారి కె.సూర్యరమేష్ తెలిపారు. వీటి వలన పంటను తెగుళ్ల నుంచి కాపాడవచ్చని, అధిక లాభాలను పొందవచ్చని చెబుతున్నారు. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు ఐదు సెంట్ల భూమిలో 20 నుంచి 25 కిలోల వరి విత్తనాలు చల్లాలని, నారుమడి పోసిన పక్షం రోజుల్లో జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖాధికారులు వివరిస్తున్నారు.

గతేడాది ముందుగానే..

గతంలో జూలై నెలాఖరున సాగునీటిని విడుదల చేస్తుండేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్‌లో సాగునీటిని అందించేవారు. 2019 నుంచి 2023 వరకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జూన్ మొదటి వారంలోనే సాగునీటిని విడుదల చేయించి, రైతులకు వరి నారుమళ్ల నుంచే సాగునీటిని అందించేవారు. రైతులు మోటార్లు ఉన్న పొలాల్లో వరి నారుమళ్లను ఇప్పటికే వేశారు. అయితే మోటార్లు లేని పొలాల్లో వరి నారుమళ్లు జోరుగా వేస్తున్నారు. ఇప్పటికే మండలంలో 50 హెక్టార్లలో ఆకుమడులు వేశారు. బీపీటీ 5204, పీఎల్ఏ 1100, ఎంటీయూ 1318, ఆర్‌పీ బయో 226 రకాల వరి వంగడాలు వేశారు.

విత్తన శుద్ధి అవసరం



వరి ఆకుమడులు వేసే ముందు విత్తన శుద్ధి అవసరం. నాట్లు వేసే వారం రోజుల ముందు వరి ఆకు మడుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. ఐదు సెంట్ల ఆకుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. దీంతో నాట్లు వేసిన నెల రోజుల వరకు పంటకు నష్టం కలిగించే ఎటువంటి పురుగులు మొక్కకు ఆశించవు.

– కె.సూర్యరమేష్, ఏఓ, సీతానగరం

బోర్లు ఉన్న చోటే..



వాతావరణం చల్లబడి చెదురు, మదురు వర్షాలు పడుతున్నాయి కానీ జోరుగా వానలు లేక ఆకుమడులు వేయడం ఇబ్బందిగా ఉంది. మోటార్లు ఉన్న ప్రాంతంలో ఆకుమడులు వేశారు. గత ఏడాది తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ద్వారా సాగునీరు ముందుగానే విడుదల చేశారు. ఈ ఏడాది ఇంకా అందించ లేదు. మెట్ట వరి ఆకుమడులకు నీరు అవసరం. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ద్వారా సాగు నీరు విడుదల ఎప్పుడు చేస్తారా అని ఎదురు చూస్తున్నాం. మరో పదిహేను రోజుల్లో దంప మడులు నాట్లు వేయడానికి సిద్ధమవుతాయి. ఆ లోగా సాగునీరు అందిస్తే బాగుంటుంది.

– ముదునూరి రామకృష్ణంరాజు, రైతు, చినకొండేపూడి

27, 28 తేదీల్లో నాక్ బృందం పర్యటన

సీతానగరం: కళాశాలకు గ్రేడ్ కేటాయించేందుకు ఈ నెల 27, 28 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీని నాక్ బృందం సందర్శించనుంది. ఈ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు సోమవారం విలేకరులకు తెలిపారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి నాక్ బృందం కళాశాలకు గ్రేడ్ కేటాయిస్తుందని చెప్పారు. అలాగే విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమవుతుందని వివరించారు. కళాశాల అభివృద్ధి కమిటీతో నాక్ బృందం సమావేశం నిర్వహిస్తుందన్నారు.

అభివృద్ధే అజెండాగా పని చేస్తా

– ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రామవరంలో అధికారులతో కలిసి రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: ప్రతీకారాలు కాదు, అభివృద్ధే అజెండాగా పనిచేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శివాలయం పునర్నిర్మాణంపై చర్చించారు. తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, వారిపై ప్రతీకారాలు తీసుకునే విధానం తనది కాదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ప్రధాన అజెండా అన్నారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా శివాలయం నిర్మాణం చేపడతామన్నారు. ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పాలక మండలి తరఫున తమ సహకారం నిరంతరం అందిస్తామన్నారు. అలాగే ఎలాంటి అడ్డూఅటంకాలు ఉండవన్నారు. అనంతరం గ్రామంలో పాడైన రోడ్లను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయా రోడ్లను త్వరితగతిన ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగభవాని, ఏఎంసీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కె.వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

కంబాలచెరువు: యూటీఎఫ్ 50 వసంతాల స్వర్ణోత్సవాలు ఈ ఏడాది డిసెంబర్‌లో నాలుగు రోజుల పాటు జరుగుతాయని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోమ్‌లో సోమవారం జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 15 వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ స్థాయి వక్తల ప్రసంగాలు, బ్లాక్‌మార్చ్, ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. వలంటీర్ల ద్వారా కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అన్ని జిల్లాల కార్యవర్గాలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్న అరుణకుమారి, మహిళా అసోసియేట్ విజయ్ గౌరీ, జిల్లా కోశాధికారి ఈవీవీఎస్సార్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

డయేరియాతో చిన్నారులకు ప్రాణాపాయం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య



రంగంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వెంకటరత్నం

సీతానగరం: ఐదేళ్ల లోపు పిల్లల్లో నీళ్ల విరేచనాల కారణంగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నియంత్రణ, సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీఓ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ డయేరియాతో పిల్లల్లో మరణాలు సంభవిస్తుండటంతో, ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. డయేరియా వ్యాధి తీవ్రత, నివారణపై అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పెద్దఎత్తున ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వర్షాలు ప్రారంభమైన కారణంగా ఇంటి పరిసరాల్లో, వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వేగంగా అభివృద్ధి చెంది, మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు కలుగుతాయన్నారు. ఎంపీడీఓ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చెత్తా చెదారం వల్ల ఈగలు వృద్ధి చెంది, విరేచనాలు, కడుపునొప్పి, కలుషిత ఆహారంతో వ్యాధులు, కలుషిత తాగునీటి వల్ల నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు వ్యాధులు వస్తాయని వివరించారు. వీటిని అరికట్టడానికి సురక్షిత మంచినీరు సరఫరా చేయడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి గుంతలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం వంటి చర్యల వల్ల సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.స్వామినాయక్, పీహెచ్‌సీ డాక్టర్ ఎన్ రాజు, డాక్టర్ మేఘన, హౌసింగ్ ఏఈ రామారావు, ఈఓపీఆర్డీ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ పి.సర్వేశ్వరమూర్తి, సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు సుధాకర్, దైవకృప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

పెదపూడి: వాతావరణ మార్పులతో గ్రామాల్లో డెంగీ, మలేరియా, అతిసారా తదితర వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని కచ్చితంగా క్లోరినేషన్ చేయాలన్నారు. నీటి సరఫరా చేసే పైపులైన్లలో ఎక్కడా లీకేజీలు లేకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలన్నారు. దోమలు ప్రబలకుండా లార్వా దశలోనే మురుగు ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. నిల్వ మాంసం, చేపలు తినకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రవిచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం అవసరం

రంగంపేట: వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే అంటువ్యాధులు ప్రబలిన సూచనలు ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఓవర్ హెడ్, జీఎల్ఆర్ ట్యాంకులు శుభ్రం చేయాలని చెప్పారు. నీటిని కచ్చితంగా క్లోరినేషన్ చేయాలన్నారు. పైపులైన్ల లీకేజీలను, పాడైన పబ్లిక్ ట్యాప్‌లను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అధిక వర్షాలు కురిసే సమయాల్లో గ్రామాల్లో చేపలు, మాంసం విక్రయాలను పంచాయతీ కార్యదర్శులు నిలుపుదల చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రైన్లు, చెత్తకుప్పలను తొలగించి, బ్లీచింగ్ పిచికారీ చేయించాలన్నారు.

ఒక్క ఫిర్యాదూ రాలేదే..!



రాజానగరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు



అర్జీని అందుకుంటున్న ఎంపీడీఓ కృష్ణప్రసాద్

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు స్పందన నిల్
- ఓపిగ్గా కూర్చుని.. మమ అనిపించిన అధికారులు



కాపవరంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

రాజానగరం: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకుని, సత్వరమే పరిష్కరించే దిశగా ప్రతి వారం నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభమైంది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉండగా, మొక్కుబడిగా రెవెన్యూ, గ్రామీణ నీటి పారుదల, వ్యవసాయం, హార్టికల్చర్, ఐసీడీఎస్ వంటి కొన్ని శాఖల అధికారులే హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక×ను నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ముందుగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో మండలంలోని 33 గ్రామాల నుంచి ఏ ఒక్కరూ సమస్యలపై అర్జీలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో హాజరైన కొద్దిపాటి అధికారులు కూడా ఓపిక ఉన్నంత వరకు ఆసీనులై, నెమ్మదిగా నిష్క్రమించారు.

పరిష్కార వేదికకు ఒకే అర్జీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఒకే ఒక అర్జీని అధికారులు అందుకున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎంపీడీఓ కృష్ణప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ పీఎస్ మూర్తి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. తాను నివసిస్తున్న వీధిలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, దానిని తక్షణమే సరి చేయాలని రఘుదేవపురానికి చెందిన కె.సత్యనారాయణ ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరిగింది.

పెన్షన్లపై ఎంపీడీఓకు వినతిపత్రం

పెదపూడి: డప్పు కళాకారులుగా మాదిగలే కాకుండా మాలలు కూడా ఉన్నారని, ఆ వివరాలు అధికారులు పరిశీలించాలని కోరుతూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కొండబాబు సోమవారం ఎంపీడీఓ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేశారు. డప్పు కళాకారుల పెన్షన్‌కు మాదిగలే కాదని, షెడ్యూల్ కులాల్లోని 59 ఉప కులాల్లో ఉన్నారని, దీనిపై అధికారులు పరిశీలించాలని కోరారు.

కొరవడిన ఫిర్యాదులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు కొరవడ్డాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ హేమసుందర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉద్యోగులంతా ఉదయం పది కల్లా కార్యాలయానికి చేరుకోవాలన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి విద్యా శాఖ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఐసీడీఎస్, డ్వాక్రా, తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా కలెక్టర్ మాధవీలత నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతరను ప్రశాంతంగా చేసుకోండి

సౌత్ జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికాప్రసాద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించనున్న కన్నమాంబ పేరంటాలు అమ్మవారి 126వ జాతర మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి ఆల్కాట్‌తోట రామాలయం కమిటీ శెట్టిబలిజ సంఘం వారు జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ జాతర సందర్భంగా ఎటువంటి అశ్లీల కార్యక్రమాలు, అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. మెయిన్ రోడ్డుపై ఊరేగింపు వెళ్లే సమయంలో సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్త వహించాలన్నారు. భక్తి శ్రద్ధలతో జరిపే ఈ కార్యక్రమంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడడం కానీ, చట్ట వ్యతిరేక చర్యలు చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

నిద్రావస్థలో నగరపాలన

వామనుడికి మూడడుగుల చోటిస్తే.. బలిచక్రవర్తిని తొక్కేసి.. ముల్లోకాలను ఆక్రమించేశాడని పురాణ గాథ. ఇది లోకకల్యాణార్థం కానీ, జీవనోపాధికి నగరపాలక సంస్థ ఓ షాపు అద్దెకిస్తే.. సొంత జాగీరులా పక్కనున్న వాటినీ ఆక్రమించేసి, అంతటితో ఆగక దానిపైనా కట్టడాన్ని నిర్మించేసి.. తమకెదురే లేదంటూ కొందరు వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఖజానాకు గండి కొడుతున్నా.. నగరపాలక సంస్థ యంత్రాంగం మాత్రం నిద్రావస్థలో కొట్టుమిట్టాడుతోంది.

- ప్రజాధనానికి గండికొట్టేలా ఆక్రమణలు
- అక్రమ నిర్మాణం చేసినా జోగుతున్న రెవెన్యూ విభాగం
- ఓ షాపు అంటూ మూడింటిని మింగేసిన వైనం
- నగరపాలక సంస్థ తీరుపై రేకెత్తుతున్న అనుమానాలు



మూడు షాపులకు సరిపడా ఏర్పాటు చేసిన బోర్డు



పైఅంతస్తులో నిర్మించిన స్టోర్ రూం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజాధనానికి గండిపడుతున్నా నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో పేరుకు ఓ షాపు అద్దెకు తీసుకుని, పక్కనున్న మరో రెండు షాపులను ఆక్రమించి.. బోర్డు ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా వ్యాపారం సాగిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విస్మయం కలిగిస్తోంది. నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులకు మామూళ్లు చెల్లిస్తే చాలు.. ప్రభుత్వ భవనాలను ఎలాగైనా వాడేసుకోవచ్చన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో బాగోతం కాదు. నగరం నడిబొడ్డున శ్రీకందుకూరి వీరేశలింగం పురమందిరం సమీపంలోని మెయిన్ రోడ్‌లో పాత కూరగాయల మార్కెట్ వద్ద నగరపాలక సంస్థ యాజమాన్యంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ ఏసీవై రెడ్డి పేరిట తొమ్మిది షాపులతో ఏసీవై షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఇందులో ఒకరు ఫొటో ఫ్రేమ్ వర్క్స్ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆయన తీసుకున్న షాపు కాకుండా, పక్కనున్న మరో దుకాణాన్ని ఆక్రమించుకున్నారు. మెట్ల వద్ద ఉన్న స్థలాన్నీ వదలకుండా, మరో షాపు నిర్మాణం చేపట్టారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

బాత్రూమ్‌నూ పడగొట్టి..

షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు సాగించే వారి అవసరాలకు నగరపాలక సంస్థ నిర్మించిన టాయ్‌లెట్లను సైతం ఆక్రమించిన అతను.. వాటిని పడగొట్టి షాపుగా మలచుకున్నారు. అందరికీ ఉపయోగపడాల్సిన టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు అందుబాటులో లేకపోవడంతో కాంప్లెక్స్‌లో వ్యాపారాలు సాగిస్తున్న పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్టోర్ రూమ్ నిర్మాణం

ఇదే కాంప్లెక్స్ పైభాగాన మెట్లను నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించడంతో పాటు, షాపింగ్ కాంప్లెక్స్‌పైనా సొంతంగా ప్రత్యేక స్టోర్ రూం నిర్మించారు. నగరపాలక సంస్థ భవనంపై నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్మాణాలు చేసి, ప్రజాధనం కొల్లగొడుతున్నా.. సంబంధిత అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు అద్దెకు తీసుకున్న వ్యక్తి.. మూడు షాపులను ఆక్రమించేలా బోర్డు ఏర్పాటు చేసుకున్నా, అధికారుల కనీస పర్యవేక్షణ కానరావడం లేదు. ఈ వ్యవహారంపై నగరపాలక సంస్థ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

మేనేజర్ వివరణ

ఈ విషయమై నగరపాలక సంస్థ రెవెన్యూ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా, నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా సహించేది లేదన్నారు. ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘన జరిగితే విచారణ చేసి, చర్యలు చేపడతామన్నారు.